సింహపురి కాలనీలో.. సమస్యల తిష్ట

- అంతర్గత రోడ్లకు మూడు దశాబ్దాలు
- చాలా చోట్ల ఛిద్రమైన సీసీ రోడ్లు
- పూడుకుపోయిన డ్రైనేజీలతో అవస్థలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

జీవీఎంసీ 98వ వార్డు పరిధి సింహపురి కాలనీలో సమస్యలు తిష్ట వేశాయి. ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోక కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హామీల వర్షం కురిపిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు ఆచరణలో మాత్రం కనీస శ్రద్ధ చూపట్లేదని ఆక్షేపిస్తున్నారు. పంచాయతీగా ఉన్నప్పుడే సమస్యలపై స్పందన ఉండేదని, జీవీఎంసీలో విలీనమయ్యాక కనీసం పట్టించుకోవట్లేదని వాపోతున్నారు.




శిథిలావస్థలో ఇంటర్నల్ రోడ్డు


పారిశుధ్య నిర్వహణ తీరుకు నిదర్శనం

సింహాచలం: సింహాచలం నుంచి వేపగుంట వెళ్లే మార్గంలో 1993లో వుడా సింహపురికాలనీ ఏర్పాటు చేసింది. 320 వ్యక్తిగత గృహాలను నిర్మించింది. అప్పట్లో లాటరీ పద్ధతిలో వాటిని కొనుగోలుదారులకు కేటాయించింది. మధ్యతరగతి వాళ్లకు ఎంతో అనుకూల ధరకు ఇళ్లు దొరకడంతో చాలా మంది విశాఖనగర వ్యాప్తంగా ఇక్కడ ఇళ్లని కొనుగోలు చేశారు. కాలక్రమేనా పలువురు నివాసితులు బహుళ అంతస్తులుగా వాటిని తిరిగి నిర్మించుకున్నారు. కొందరు ఇప్పటికీ అవే ఇళ్లల్లో జీవనం సాగిస్తున్నారు. 2007 వరకు వేపగుంట పంచాయతీలోను, ఆ తర్వాత జీవిఎంసీ 72వ వార్డులోను ఉన్న సింహపురికాలనీ ఇప్పుడు 98వ వార్డులోకి వెళ్లింది. అప్పటి నుంచే దీన్ని పాలకులు పట్టించుకోవడం మానేశారని స్థానికులు ఆక్షేపిస్తున్నారు.

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం


మురుగునీటి కాలువల దుస్థితి



కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ మరీ దారుణంగా ఉంది. చాలా చోట్ల శిథిలావస్థకు చేరి, అస్తవ్యస్తంగా మారాయి. పలు చోట్ల మురుగునీరు ఎటూ వెళ్లలేని పరిస్థితి. ఇంకొన్ని చోట్ల డ్రైన్లు పూర్తి శిథిలావస్థకు చేరాయి. మొక్కలు మొలిచి, చెత్తాచెదారంతో పూడుకుపోయాయి. అక్కడక్కడా డ్రైన్లు ఉన్నాయన్న విషయాన్నే గుర్తించలేనంతగా మూతపడ్డాయి. దీంతో మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి, దుర్వాసన వెదజల్లుతోంది. దోమల బెడద పెరుగుతోంది. ఇక వర్షాకాలంలో మురుగునీరంతా రోడ్లపైకే వస్తోంది. వర్షం కురిసే సమయంలోనైతే రోడ్డేదో.. కాలువేదో కూడా కనుక్కోవడం కష్టం. ఇక్కడ పారిశుధ్య నిర్వహణ మరీ దారుణం. జీవీఎంసీ ప్రజారోగ్య విభాగానికి మొరపెట్టుకున్నా.. పట్టించుకోవట్లేదని స్థానికులు ఆక్షేపిస్తున్నారు.

అధ్వానం.. అంతర్గత రోడ్లు

కాలనీలో ఎల్‌ఐజీ, ఎంఐజీ–1, ఎంఐజీ–2లు మూడు కేటగిరీలు, మూడు ఫేజ్‌లలో ఇళ్లను నిర్మించారు. ఈ మూడు దశల్లో చేపట్టిన ఇళ్లకు 12 ఇంటర్నల్ రోడ్లు ఉన్నాయి. కాలనీ ఏర్పాటు చేసినప్పుడు ఉన్న ఇంటర్నల్(అంతర్గత) రోడ్లు తప్ప, మళ్లీ ఈ కాలనీలో ఇంటర్నల్ రోడ్లు వేసిన పాపాన పోలేదు. 32 ఏళ్ల క్రితం వేసిన రోడ్లన్నీ రాళ్లుతేలి శిథిలావస్థకు చేరాయి. దీనికి తోడు ఇంటింటి కుళాయిలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల పేరిట రోడ్లను తవ్వేయడంతో మరింత అధ్వానంగా మారాయి. రాళ్లు తేలిన రోడ్లపై వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారుతోంది. ఇక వర్షం కురిస్తే ఇక్కడి దుస్థితి వర్ణనాతీతం. ఏళ్ల తరబడి పునరుద్ధరణకు నోచుకోని రోడ్లను అభివృద్ధి చేయాలని కాలనీవాసులు ప్రజాప్రతినిధుల వద్దకు, జీవీఎంసీ అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతూనే ఉన్నారు. వినతి పత్రాలు ఇస్తూనే వస్తున్నారు. అయినా ఇంటర్నల్ రోడ్ల స్థితిగతుల్లో ఏ మాత్రం మార్పులేదు.

ఉత్తుత్తి హామీలకే పరిమితం



కాలనీ సమస్యలు పరిష్కరించాలని ఎన్నిసార్లు మొరపెట్టుకుంటున్నా పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవట్లేదు. ఇదిగో అదిగో అంటున్నారే తప్ప, కాలనీ వైపు కనీసం కన్నెత్తి కూడా చూడట్లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి.
– చిరంజీవిరావు, సింహపురికాలనీ

గొప్పలు చెప్పుకుంటున్నారు



కాలనీలో ఏళ్ల తరబడి సమస్యలు తిష్ట వేశాయి. ప్రజాప్రతినిధులు, అధికారుల వద్దకు చాలాసార్లు వెళ్లి, వినతి పత్రాలు అందించాం. పట్టించుకున్న పాపాన పోలేదు. కంటి తుడుపు చర్యలు మినహా, పెద్దగా కాలనీ సమస్యల్ని పట్టించుకున్న దాఖలాల్లేవు. ఏం చేయకున్నా.. చేసినట్లు గొప్పలు చెప్తున్నారు.
– రామరాజు, సింహపురికాలనీ

క్లుప్తంగా

దేవదాయశాఖ మంత్రికి ఆహ్వానం


మంత్రి రామనారాయణరెడ్డికి అప్పన్న జ్ఞాపిక అందిస్తున్న ఈవో

సింహాచలం: ఈ నెల 8న నిర్వహించనున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవానికి, 30న జరిగే చందనోత్సవానికి రావాల్సిందిగా రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని దేవస్థానం అధికార, వైదిక వర్గాలు ఆహ్వానం పలికాయి. ఈ మేరకు దేవస్థానం ఈవో కె.సుబ్బారావు వేద పండితులతో కలిసి మంగళవారం అమరావతి వెళ్లి సచివాలయంలో మంత్రికి ఆహ్వాన పత్రికను అందించారు. వేద పండితులు ఆశీర్వచనమిచ్చి, శేషవస్త్రాలను, ప్రసాదాన్ని అందించారు. ఈవో వెంట దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, ఈఈ రాంబాబు ఉన్నారు.

కథల పుస్తకాలు, క్రీడా సామగ్రి వితరణ



విద్యార్థులకు కథల పుస్తకాలను అందిస్తున్న మాజీ ఎంపీపీ అప్పలనాయుడు

పరవాడ: విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుదలకు దోహదపడే కథల పుస్తకాలు, శారీరక దృఢత్వానికి అవసరమైన క్రీడా సామగ్రిని అందించిన ఎంవీ ఫౌండేషన్ యాజమాన్యానికి పరవాడ మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు ధన్యవాదాలు తెలిపారు. ఎంవీ ఫౌండేషన్ యాజమాన్యం మండలంలోని పలు స్కూళ్లకు కథల పుస్తకాలు, క్రీడా సామగ్రి అందించింది. వాడచీపురుపల్లి పాఠశాల విద్యార్థులకు వాటిని మాజీ ఎంపీపీ మంగళవారం పంపిణీ చేశారు. ఫౌండేషన్ కోఆర్డినేటర్లు మల్లేశ్వరరావు, ధనలక్ష్మి మాట్లాడుతూ పాఠశాల స్థాయి విద్యార్థుల్లో డ్రాపౌట్లు తగ్గించే లక్ష్యంతో సంస్థ పనిచేస్తోందన్నారు. పాఠశాల హెచ్‌ఎం పి.కనకేశ్వరరావు, స్కూల్ కమిటీ చైర్మన్ లెక్కల సన్యాసిరావు, ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం టి.సౌభాగ్యలక్ష్మి, వాడచీపురుపల్లి పంచాయతీ కార్యదర్శి అచ్యుతరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక నేత సుబ్బారావుకు నివాళి


సుబ్బారావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సిటు నాయకులు

పరవాడ: జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా పనిచేసిన, దేశపాత్రునిపాలెం గ్రామానికి చెందిన జి.సుబ్బారావు ద్వితీయ వర్ధంతిని సిటు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ నిరతంరం కార్మికుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన వ్యక్తిగా సుబ్బారావును కొనియాడారు. తన పోరాటాలతో జీవిఎంసీ కార్మికుల వేతనాలు పెరగడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయించారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి కార్మికుడు శ్రమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిటు నాయకులు వి.వి.రమణ, లోవరాజు, బంగారమ్మ, చిట్టిబాబు పాల్గొన్నారు.

పార్లుపాలెంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతదేహం

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు పార్లుపాలెం రైల్వే ట్రాక్ సమీపంలోని వేపాడమ్మతల్లి ఆలయం వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు మంగళవారం గుర్తించారు. దీనిపై పెందుర్తి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ కె.వి.సతీష్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ అసిరితాత సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతునికి 35–40 ఏళ్ల వయసు ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తు జరుగుతోంది.

వృద్ధుడు అదృశ్యంపై ఫిర్యాదు

అనకాపల్లి/పెందుర్తి : విశాఖ, సింహాచలం, జీఎన్‌యూఆర్‌ఎం కాలనికి చెందిన వేపా అప్పారావు(73) గత ఏడాది అక్టోబర్ 24న సింహాచలం నుంచి అనకాపల్లి మిరియాల కాలనీలో నివసిస్తున్న అప్పారావు చెల్లెలు శ్రీపాద లక్ష్మి ఇంటికి వెళ్లాడు. అయితే నేటికీ తిరిగి రాకపోవడంతో అప్పారావు కుమారుడు వేపా అచ్యుత రామకృష్ణ మంగళవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. అప్పారావు కొన్ని సంవత్సరాలుగా మానసిక వ్యాధితో బాధపడుతున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

గంజాయి కేసులో నిందితుల అరెస్ట్, రిమాండ్

- అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన మరో ఇద్దరి కోసం గాలింపు
- మీడియాతో వెస్ట్‌జోన్ ఏసీపీ పృథ్వీతేజ


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ పృథ్వీతేజ, చిత్రంలో సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: ఒడిశా నుంచి నాసిక్‌కు రూ.10 లక్షల విలువైన 180 కిలోల గంజాయిని తరలిస్తూ పోలీసులకు సోమవారం చిక్కిన కేసులో ఏడుగురు నిందితుల్లో ఐదుగురిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు వెస్ట్ జోన్ ఏసీపీ ఏబీ పృథ్వీతేజ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ తెలిపిన వివరాలు..

ముంచంగిపుట్‌కు చెందిన బిసోయి సహదేవ్, కొర్ర సన్యాసిరావు, మహారాష్ట్ర నాసిక్‌కు చెందిన అజయ్ సామ్ చావన్, అంకిత్ జోషి, శ్రీనివాస్ వాగ్, ఒడిశాకు చెందిన ప్రేమ్‌కుమార్, దావుద్‌ఖాన్ ఓ ముఠా. వీరిలో దావుద్‌ఖాన్, శ్రీనివాస్ వాగ్ ప్రధాన సూత్రదారులు. వీరు అల్లూరి సీతారామరాజు జిల్లా, ఒడిశా ప్రాంతాల్లోని గంజాయిని సేకరించి దేశంలోని అన్ని ప్రాంతాలకు తరలిస్తుంటారు. ఈ క్రమంలో సోమవారం ఫోర్స్ మినీ టెంపో ట్రావెలర్‌లో 180 కిలోల గంజాయిని ఒడిశా నుంచి అరకు మీదుగా నాసిక్‌కు తరలించేందుకు విశాఖ నగరం వైపు వెళుతున్నారు. వ్యాన్‌కు ముందు రెండు బైక్‌లు ఎస్కార్ట్‌గా ఉన్నాయి. దీనిపై సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్, పెందుర్తి పోలీసులు సీఐ కె.వి.సతీష్‌కుమార్ సారథ్యంలో పెందుర్తి మండలం రాజయ్యపేట సమీపంలో కాపు కాశారు. మినీ వ్యాన్‌ను అడ్డుకుని అందులో పరిశీలించగా గంజాయి పట్టుబడింది. ఐదుగురు నిందితులు సహదేవ్, సన్యాసిరావు, అజయ్, అంకిత్, ప్రేమ్‌కుమార్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఏసీపీ వెల్లడించారు. వారి నుంచి గంజాయి, మినీ టెంపోతో పాటు రెండు బైక్‌లు, రూ.10 వేల నగదు, ఐదు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో సీఐ కె.వి.సతీష్‌కుమార్, ఎస్ఐ స్వామినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

రాంపురంలో అభివృద్ధి పనులకు శ్రీకారం


డ్రైనేజీ పనులను శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ అన్నంరెడ్డి శిరీష, జెడ్పీటీసీ ఉప్పిలి దేవి

పెందుర్తి: రాంపురం పంచాయతీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని సర్పంచ్ అన్నంరెడ్డి శిరీష అన్నారు. గ్రామంలో డ్రైనేజీల నిర్మాణానికి ఎంపీపీ మధుపాడ నాగమణి, జెడ్పీటీసీ ఉప్పిలి దేవితో కలిసి శిరీష మంగళవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.12 లక్షల జెడ్పీ నిధులతో ఆయా పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చిరికి దేముడు, వైస్ సర్పంచ్ లెక్కల కిషోర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు మధుపాడ అంజి, బాదిరెడ్డి కృష్ణ, నగేష్, హిట్లర్ శ్రీను, వార్డు మెంబర్ మౌళి, పంచాయతీ కార్యదర్శి ప్రసన్నకుమార్, వీఆర్వో రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


24న కలెక్టరేట్ల వద్ద నిరసన

సిటు, భవన నిర్మాణ కార్మికుల సంఘం


భవన నిర్మాణ కార్మికులతో సిటు నాయకులు

సింహాచలం: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సిటు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు విమర్శించారు. 98వ వార్డు పరిధి అడవివరంలో మంగళవారం భవన నిర్మాణ కార్మిక సంఘం జనరల్ బాడీ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న పలువురు నాయకులు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే.. భవన నిర్మాణ కార్మికుల బోర్డును అమల్లోకి తెస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం, పది నెలలు గడుస్తున్నా హామీని నిలబెట్టుకోలేదని ఆక్షేపించారు. పెండింగ్‌లో ఉన్న క్లెయింలు ఇస్తామని, మెమోను రద్దు చేస్తామని చెప్పిన హామీ కూడా అమలుకు నోచుకోలేదన్నారు. దీనిపై కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆక్షేపించారు. కూటమి ప్రభుత్వ తీరుకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులంతా ఈ నెల 24న కలెక్టరేట్‌ల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ నిరసన కార్యక్రమాలను భవన నిర్మాణ కార్మికులంతా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిటు నాయకులు ముద్దాడ ప్రసాద్, ఎం.రామునాయుడు, ఎం.నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

చినముషిడివాడలో భూ ఆక్రమణపై ఫిర్యాదు


తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌కు ఫిర్యాదిస్తున్న మెంటి మహేష్

పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ కూడలి వద్ద సర్వే నెం.113లో ప్రభుత్వ భూమిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్‌కు వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు మెంటి మహేష్ ఫిర్యాదు చేశారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. వార్డులో టీడీపీ నాయకుల భూ కబ్జాలు ఎక్కువైపోయాయని మహేష్ అన్నారు. రూ.5 కోట్ల విలువైన స్థలాన్ని యథేచ్ఛగా ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. గతంలో ఈ స్థలంలో నిర్మాణం చేపడితే జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారులు అడ్డుకున్నారని పేర్కొన్నారు. అప్పట్లో స్వయంగా జిల్లా డిప్యూటీ కలెక్టర్ వచ్చి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు మళ్లీ అదే స్థలంలో నిర్మాణం చేపడుతుంటే చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నా రు. అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలం దురాక్రమణను అడ్డుకోవాలని కోరారు.

పింఛన్ల పంపిణీ సజావుగా జరగాలి

ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్


పింఛన్ల పంపిణీపై ఆరా తీస్తున్న ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, జేసీ మయూర్ అశోక్

పెందుర్తి: ప్రభుత్వం అందిస్తున్న సామాజిక పింఛన్లు క్షేత్రస్థాయిలో సజావుగా లబ్ధిదారులకు అందేలా చూడాలని సంబంధిత అధికారులకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ సూచించారు. పెందుర్తి మండలం పినగాడి, రాంపురం పంచాయతీల్లో మంగళవారం ఆయన పర్యటించారు. పింఛన్ల పంపిణీ తీరును సమీక్షించారు. పింఛన్‌దారులతో ముచ్చటించారు. ప్రభుత్వం నుంచి అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. సచివాలయాల సిబ్బంది పనితీరు గురించి ప్రజలకు అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లు పంపిణీ చేశారు. జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- జీవీఎంసీ 95వ వార్డు పాపయ్యరాజుపాలెంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పింఛన్లు పంపిణీ చేశారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు రేపు

సబ్బవరం: మండలంలోని బీసీ, ఇతర కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఈ నెల 3న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పద్మజ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 24 పంచాయతీల నుంచి 884 మంది అభ్యర్థులు వివిధ కార్పొరేషన్ల పరిధిలో రుణాలకు దరఖాస్తులు చేసుకున్నట్లు వెల్లడించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో కేటాయించిన గ్రామాల వారీగా ఇంటర్వ్యూలను నిర్వహిస్తామన్నారు. రుణాల మంజూరుకు బ్యాంకులు బ్రాంచ్‌ల వారీగా లక్ష్యాలను నిర్దేశించినందుకు, దరఖాస్తుల్ని పరిశీలించి, అంగీకారం తెలపనున్నట్లు పేర్కొన్నారుర. సచివాలయాల పరిధిలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు సమాచారం అందించి, ఇంటర్వ్యూలకు హాజరయ్యేలా చూడాలని, వారు కూడా హాజరుకావాలని ఆదేశించారు. దరఖాస్తుదారులు ఆన్‌లైన్‌లో సమర్పించిన ధ్రువపత్రాలు, డౌన్‌లోడ్ చేసుకున్న దరఖాస్తులను విధిగా తీసుకురావలన్నారు.

లలితాంబికకు ప్రత్యేక పూజలు


కుంకుమార్చనలో తాతియానా(రష్యా)


పూజలందుకున్న లలితాంబిక

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి క్షేత్రంలో లలితాంబిక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన మంగళవారం లలితాంబిక అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. సంధ్యా సమయంలో లాలితా సహస్ర నామావళి పారాయణం, కుంకుమార్చనలను స్థానిక మహిళలతో కలిసి విదేశీ మహిళలు నిర్వహించారు. రష్మీ మాలా సహిత లలితా హోమం, లలితా అమ్మవారికి క్షీరాభిషేకం చేశారు. సామూహిక కళావాహన జరిపారు. గురుమాత అన్నపూర్ణమ్మ చేతుల మీదుగా ప్రసాద వితరణ చేశారు.

వాడచీపురుపల్లిలో అనకాపల్లి జిల్లా కలెక్టర్

పింఛన్ల పంపిణీ, స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర పరిశీలన


లబ్ధిదారులు పింఛన్ అందజేస్తున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్


చెత్త బుట్టలను అందిస్తున్న జిల్లా ప్రత్యేక అధికారి గిరిషా, కలెక్టర్ విజయ కృష్ణన్

పరవాడ: మండలంలోని వాడచీపురుపల్లి గ్రామాన్ని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మంగళవారం సందర్శించారు. ప్రభుత్వం అందిస్తున్న సామాజిక పింఛన్ల పంపిణీలో పాల్గొని, లబ్ధిదారులకు పింఛన్ అందించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ పింఛన్ల కోసం ఎవరైనా లంచం అడుగుతున్నారా? అవకతవకలేమైనా ఉన్నాయా? అని ఆరా తీశారు. అనంతరం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామంలో 89 మంది వ్యాపారులకు తడి, పొడి చెత్త బుట్టలను జిల్లా ప్రత్యేక అధికారి గిరిషా అందించారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, పరవాడ మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, సర్పంచ్ శివలంక లక్ష్మి, జనసేన నాయకులు పంచకర్ల ప్రసాద్, రావాడ సర్పంచ్ మోటూరి సన్యాసినాయుడు, పరవాడ ఎంపీడీవో వి.ధర్మారావు, తహసీల్దార్ ఎస్వీ అంబేడ్కర్, వెలుగు ఏపీఎం రంగారావు, పంచాయతీ కార్యదర్శి అచ్యుతరావు, ఉప సర్పంచ్ కూండ్రపు శ్రీనివాసరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

సైన్స్ డే జోనల్ పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ


గురుకుల పాఠశాల విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న ఇంద్రజిత్తు పాత్ర తదితరులు

సబ్బవరం: జాతీయ సైన్స్ డేను పురస్కరించుకుని అటమిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో జోనల్ స్థాయిలో సబ్బవరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. విశాఖలోని సీతమ్మధరలో ఉన్న అటమిక్ మినరల్స్ డైరెక్టరేట్ కార్యాలయంలో డైరెక్టరేట్ ఇన్‌చార్జ్ ఇంద్రజిత్తు పాత్ర చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. ఫిబ్రవరి నెల 28న జాతీయ సైన్స్ డే సందర్భంగా నిర్వహించిన జోనల్ స్థాయిలో వ్యాసరచన, క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలను నిర్వహించారు. క్విజ్ జూనియర్ విభాగంలో సబ్బవరం గురుకుల పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి కె.సుధాకర్ ప్రథమ స్థానంలో, 7వ తరగతి చదువుతున్న కె.కార్తికేయ ద్వితీయ స్థానంలో నిలిచారు. వ్యాస రచన సీనియర్ విభాగంలో ఎ.సుశాంత్ స్వరూప్ ద్వితీయ స్థానం పొందారు. వీరికి ఇంద్రజిత్తు పాత్ర చేతుల మీదుగా జ్ఞాపిక, సర్టిఫికెట్లు ప్రదానం చేసినట్లు ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ తెలిపారు. విజేతలను, గైడ్ టీచర్ డాక్టర్ టి.రాంబాబు, ప్రిన్సిపాల్ రామకృష్ణలను డీసీవో సి.ప్రభావతమ్మ అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చిరంజీవి, తెలుగు టీచర్ ఐజక్‌తో పాటు ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూ రీ సెటిల్‌మెంట్ రిజిస్టర్ కాపీలకు వినతి


జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ యువ మోర్చా కార్యదర్శి రామకృష్ణ

పరవాడ: వాడచీపురుపల్లి తూర్పు రెవెన్యూలో భూముల వివరాలను సమాచార హక్కు చట్టం ద్వారా అందించడానికి చర్యలు తీసుకోవాలని బీజేపీ యువ మోర్చా జిల్లా కార్యదర్శి మోసా రామకృష్ణ అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. వాడచీపురుపల్లి తూర్పు ఖండంలోని సర్వే నంబర్లు 328, 29, 31, 32, 33, 34 లకు సంబంధించిన రీ సెటిల్‌మెంట్ రిజిస్టర్ కాపీలను అధికారికంగా ధ్రువపర్చి, ప్రాంతీయ భాషలో ఇప్పించాలని కలెక్టరుకు అందించిన వినతి పత్రంలో రామకృష్ణ కోరారు.